# విశ్వనాథ కవిత్వం

- భైరవభట్ల కామేశ్వరరావు

(చివరి భాగము)

ఇవన్నీ ఉండికూడా యిలా ఉందేమిటి అనుకునేట్టుగా ఉందిట. అంటే పంచభూతాల్లోనూ మన్మథునికి సంబంధించిన అంశ ఉండికూడా యిలా కోరికని కాక వికర్షణని కలిగించేదిగా ఉందేమిటి అని అనుకొనే విధంగా ఉంది. కళ్ళకి ఉండే సహజమైన చూపంతా చెల్లాచెదరైపోయేట్టుగా ఉందట. "కనులు చెదరిపోయే అందం" అనే జాతీయాన్ని ఎలా మార్చారో చూడండి! ఇక్కడ చెదరిపోతున్నది కంటికి సహజమైన చూడగలిగే శక్తి. అంటే ఆమె రూపం అంత కృత్రిమంగా ఉందన్న మాట.

ఇప్పుడు మళ్ళీ ఒక్కసారి పద్యాన్ని చదివి శూర్పణఖ రూపాన్ని ఊహించుకోడానికి ప్రయత్నించండి. రసాభాసని యింత అద్భుతంగా ఒక పద్యంలో నిర్వహించడం అసామాన్యం! మనం ఎంత దూరం ఆలోచించినా అంతకు బారెడు దూరాన ఉంటుంది విశ్వనాథ ఊహ.

విశ్వనాథ ఊహ పరిధి ఎంత విశాలమైనదో అతని దృష్టి అంత నిశితమైనది. చిన్న చిన్న విషయాల గురించి కూడా సూక్ష్మంగా ఆలోచించి, అందులో ఒక కొత్తదనాన్ని చూపించడం విశ్వనాథ ప్రతిభ. రాముడు సీతకి తాళి కట్టే సన్నివేశంలో యీ పద్యాన్ని చూడండి:

> కరరుహంబులు చర్మంబు గాకపోయె,
> నవియు బులకించునేమొ ప్రియాగళాత్త
> మైన స్పర్శసుఖాప్తి, బ్రియాగళంబు
> నంటి బాధించు వీని కేలా సుఖంబు?

సీత మెడలో రాముడు వంగి తాళి కడుతున్నాడు. అలా కట్టేటప్పుడు రాముని చేతి గోళ్ళు సీత మెడని తాకాయి. కాని గోళ్ళు చర్మం కాదు కదా. కాబట్టి వాటికి స్పర్శ జ్ఞానం లేదు. ఉంటే అవి కూడా ఆ స్పర్శకి పులకించి ఉండేవట. అయినా ప్రియురాలి మెడని తాకి బాధించిన ఆ గోళ్ళకి అలాంటి సుఖం ఎందుకు కలగాలి? సీతారామ కల్యాణాన్ని ప్రత్యక్షంగా తన అంతరంగంలో అతి సూక్ష్మంగా దర్శిస్తున్న కవి ఊహ యిది! రామాయణంలోని ప్రతి అంశాన్ని ఇంత సూక్ష్మంగా దర్శించి, మనకి దర్శింపచేస్తారు విశ్వనాథ.

విద్యను అభ్యసించే కాలంలో యాజ్ఞవల్క్యుని వృత్తాంతం గురించి చదువుకున్నాడు రాముడు. అప్పుడతను యిలా అనుకున్నాడట:

> మనసై రాముడు మైథిలేయ పరిషన్మధ్యంబునస్ యాజ్ఞవ
> ల్క్యుని వాదాద్భుత మట్టి యద్భుతము నాలోచించు, జేయంగ చే
> సినచో నట్టిది మైథిలేయ సభలో జేయస్ వలెస్ వేదముల్
> వినుతించుస్ మిథిలా సభాగత మహావృత్తాంత మంచెంచుచుస్

యాజ్ఞవల్క్యుడు జనకుని కొలువులో అద్భుతమైన శాస్త్ర చర్చని చేస్తాడు. దాని గురించి చదివినప్పుడు ఆ విషయమే ఆలోచించి, వేదాలన్నీ కీర్తించేలా జనకుని కొలువులో చేస్తే యిలాటి అద్భుతమైన కార్యమేదైనా చెయ్యాలి అని అనుకున్నాడట రాముడు. చదివే వాళ్ళందరికీ రామాయణం తెలుసు. రాముడు నిజంగానే జనకుని కొలువులో మహాద్భుతమైన కార్యం, శివధనుర్భంగం చేయబోతున్నాడని తెలుసు. అయితే, చదువుకొనే రోజుల్లోనే అలాంటి ఆలోచన రామునికి కలిగిందనే ఊహ గొప్పగా అనిపిస్తుంది. దీన్నే భవిష్యత్సూచన అంటారు. విశ్వనాథ రచనలలో చాలాచోట్ల ఇలాంటి భవిష్యత్ సూచనలు కనిపిస్తాయి. ఇది ఇంగ్లీషు నాటకాలలో ఎక్కువుగా ఉందని, తను అక్కడినుంచే దీన్ని గ్రహించాననీ విశ్వనాథ చెప్పుకున్నారు.

వర్ణనలలోనే కాదు, సన్నివేశ కల్పనలో కూడా విశ్వనాథ ఊహ సామాన్యమైనది కాదు. బంగారు లేడిని చూసి సీత దాన్ని పట్టి తెమ్మని రాముణ్ణి అడిగినప్పుడు, యిది రాక్షస మాయలా ఉంది అని లక్ష్మణుడు వారించడం వాల్మీకి రామాయణంలో ఉన్న సన్నివేశమే. అయితే లక్ష్మణుడు ఎందుకది రాక్షస మాయ అని అనుకుంటున్నాడో పెద్దగా వివరణ లేదు. కల్పవృక్షంలో దానికి సూక్ష్మ పరిశీలనా దృష్టితో సహేతుకమైన వివరణ కల్పన చేసారు విశ్వనాథ. అది లక్ష్మణుని ద్వారా పలికించారు.

"ఇది వరకు రెండు కాళ్ళపై నేగు ప్రాణి, యిపుడు నాలుగు కాళ్ళపై నేగవలసి పడెడు నిబ్బంది యల్ల కన్పడెడు" అంటాడు. పైగా ఆ మాయలేడి ప్రతి చర్యని అతి జాగ్రత్తగా గమనిస్తూ వివరిస్తాడు:

> పచ్చిక మేయబో దదొక వాటుగ దా గొరుకుస్, దదారుచిస్
> మెచ్చదు కన్నులస్, నమిలి మ్రింగద, యీ దెస వెట్టు వీనుగా
> నిచ్చటి వార్తలస్ వినునొ యేను వచించుచునుండ నంతలో
> నచ్చపు మైజిగుల్ వెలతెలైనవి ముందరి కాంతులొప్పునే

"నిజంగా అది గడ్డి మేస్తున్నట్టు లేదు. అదొక పక్కగా కొరుకుతోంది. ఆ రుచి దానికి ఇష్టం లేదని ఆ కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది. నమిలి మింగటం లేదు. పైగా ఈ పక్కకి చెవులు రిక్కించి మన మాటలు వింటున్నట్టుగా ఉంది. ఇప్పుడు నేను మాట్లాడుతూ ఉండగానే చూడండి ఎలా దాని శరీర కాంతి కోల్పోయి వెలవెల పోతోందో!"

ఇంతకన్నా నిశిత పరిశీలన ఎక్కడుంటుంది చెప్పండి! ఇదంతా చాటుగా వింటున్న రావణుడు లక్ష్మణుడి యీ హేతుబద్ధ పరిశీలనకి ఆశ్చర్యపోతాడు. సైన్యం లేకపోయినా ఫరవాలేదు, రాజ్యం లేకపోయినా బాధ లేదు, రాజుకి ఇలాంటి ఒక్క మంత్రి ఉంటే చాలు కదా అనుకుంటాడు. ఇంకా అనుకుంటాడూ,

> ఇంత భయమెఱుంగ నేనెన్నడును వీని
> భావ సరణి గనిన భయము వేయు

నొక్క మంత్రి యిట్టి డున్నచో నాకును
శతములైన జనకసుతల దెత్తు

భయమంటే తెలియని రావణుడికి లక్ష్మణుడి ఆలోచనా ధోరణి భయం కలిగించిందిట. ఎందుకంటే యింత వివరంగా అది లేడి కాదు రాక్షసుడే అని లక్ష్మణుడు చెపుతున్న మాటలని రాముడు కాదన గలడా? దాన్ని పట్టుకోడానికి రామలక్ష్మణులిద్దరూ సీతని విడిచిపెట్టి వెళతారా? తను వేసిన పథకమంతా పారకుండా పోతుందేమోననే భయం పుట్టింది. ఇక్కడదాకా ఎవరైనా ఊహించ గలరేమో, కాని తర్వాత ఆలోచన మాత్రం, మనసులో పాత్రల స్వభావాలు ప్రతిక్షణం కదలాడే కవి మాత్రమే చెయ్యగలిగిన ఆలోచన. "ఇలాంటి మంత్రే కనక నాకు ఒక్కడుంటేనా, యిలాటి సీతలని వందమందినైనా ఎత్తుకు వెళ్ళిపోయేవాణ్ణి కదా!" అనుకుంటాడట రావణుడు!

ఇలా వాల్మీకి రామాయణంతో విరోధించకుండా అద్భుతమైన కొత్త కల్పనలనెన్నిటినో విశ్వనాథ తన రామాయణ కల్పవృక్షంలో చేసారు.

శిల్ప నైపుణ్యం విషయానికి వస్తే, అది కథానిర్మాణానికి, కథనానికి, పాత్ర చిత్రణకి, సంభాషణలకి సంబంధించినది. కథా, కవిత్వమూ వేరు కాని రోజులలో యివన్నీ కావ్య రచనలో భాగంగానే ఉండేవి. కథా కావ్యం రసవంతం కావడానికి శిల్పం చాలా దోహదం చేస్తుంది. దీని గురించి వివరించాలంటే విశ్వనాథవారి నాటకాలు – *అనార్కలి, నర్తనశాల, త్రిశూలం, వేనరాజు* మొదలైనవాటి గురించి, రామాయణ కల్పవృక్షం గురించి మరింత వివరంగా పరిచయం చెయ్యాల్సి ఉంటుంది. అప్పుడీ వ్యాసం పెద్ద గ్రంథమై కూర్చుంటుంది. అంతే కాకుండా ఇప్పుడు మనం కవిత్వం గురించి పరిమితార్థంలోనే మాట్లాడుకుంటున్నాం కాబట్టి ప్రస్తుతానికి దాని జోలికి వెళ్ళడం లేదు.

బియ్యం, నీళ్ళు, వండడానికి పాత్ర - ఇన్నీ ఉన్నా నిప్పులేకుండా అన్నం తయారు కాదు. అలాగే రచనా నైపుణ్యం, భాష, కల్పనా చాతుర్యం, యిలా ఎన్నున్నా సరిపోవు. ఒక రచన కవిత్వం కావాలంటే కవి అంతరంగంలో నిరంతరం జ్వలించే ఒక తీవ్రానుభూతి అవసరం. ఆ అనుభూతే కవిత్వమై పాఠకుని అంతరంగాన్ని స్పృశిస్తుంది. దీనినే విశ్వనాథవారు "జీవుని వేదన" అన్నారు. "తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండు నేకమై, నా సకలోహ వైభవ సనాథము నాథు కథన్ రచించెదన్" అని కల్పవృక్షంలో చెప్పుకున్నారు. అయితే యీ వేదన ఒక్క కల్పవృక్షంలోనే కాదు అతని రచనలన్నిటా కనిపిస్తుంది. మన గుండెలని కదిలిస్తుంది. కొన్ని రచనలలో అది ఆత్మాశ్రయమైతే, మరి కొన్ని రచనలలో పాత్రలని ఆశ్రయించి ఉంటుంది. ఇదీ అని తేల్చి చెప్పడానికి సాధ్యం కాని వేదన యిది. ఇందులో అనేక ఛాయలు. సంసారపుటీతిబాధలు ఒక వంక, మారుతున్న సమాజంలో మనం కోల్పోతున్న సాంప్రదాయ విలువల పట్ల మానసిక ఆరాటం మరో వంక వీటన్నిటినీ మించి ఏదో తెలియని ఒక ఆత్మీయమైన వేదన, విశ్వనాథ రచనలంతటా పరచుకొని ఉంటుంది.

ఆత్మాశ్రయమైన విశ్వనాథ వేదన ప్రముఖంగా అతని శతకాల్లో కనిపిస్తుంది. రసము, ఔచిత్యము, అలంకారాలు ఇవేవీ లేని "నగ్నోద్విగ్న కవిత్వము" తనదని విశ్వేశ్వర శతకంలో వాపోతారతను. ఈ శతకంలో విశ్వనాథ ఆ విశ్వేశ్వరునితో చాలా చనవు తీసుకుని మాట్లాడతారు. తన కష్ట సుఖాలన్నీ వెళ్ళబోసుకుంటారు.

విశ్వనాథ తండ్రి శోభనాద్రిగారు మహా దాత. ఆస్తులన్నీ అతని దాతృత్వపు మంటకి ఆహుతై పోయాయి. అతను కాశి నుంచి శివలింగాన్ని తెచ్చి వాళ్ళ స్వగ్రామం నందమూరులో ప్రతిష్ఠించారు. ఆ విశ్వేశ్వరుడే మీకు దిక్కని పిల్లలకి చెప్పి శోభనాద్రిగారు స్వర్గస్థులయ్యారు. అందుకే ఆ స్వామంటే విశ్వనాథకి అంత చనవు.

మీ దాతృత్వమొ తండ్రి దాతృతయొ మీ మీ మధ్యనున్నట్టి లా
వాదేవీలకు నాదు బాధ్యతకు సంబంధంబు లేదిట్లు రా!
ఏదో లెక్కలు తేల్చుకో! మొఱటుతో నేలా? యొడల్ మండెనా
ఏదో వచ్చిన కాడి కమ్మెదను సుమ్మీ నిన్ను విశ్వేశ్వరా!

"నీకూ మా తండ్రిగారికి మధ్యనున్న లావాదేవీలతో నాకు సంబంధం లేదు. ఇలా రా. ఈ లెక్కలేవో తేల్చేసి వెళ్ళు. నాలాంటి మొఱటు మనిషితో పెట్టుకోకు. ఒళ్ళు మండిందంటే నిన్ను ఏదో వచ్చినకాడికి అమ్మేస్తాను సుమా" అని విశ్వేశ్వరుని బెదిరించే ధైర్యం విశ్వనాథకి ఎక్కడనుంచి వచ్చింది? అతని మనసులో ఎంతటి ఆవేదన అతనిచేత యిలాటి మాటలనిపించింది? విశ్వనాథ పలుకు "దారుణాఖండలు శస్త్ర తుల్యము", వజ్రాయుధం లాంటిది. అయితే ఇంతలేసి మాటలని కూడా చివరకి అతను చేసిందేమిటి? జ్ఞానపీఠ బహుమతికి గాను తనకి వచ్చిన లక్షరూపాయలు నందమూరులో ఆ విశ్వేశ్వరుని దేవాలయానికే సమర్పించేసారు!

స్వామీ! యేలనయా బహూక్తుల నినున్ బ్రార్థించుచున్నాను, రెం
డే మాటల్, సిరులిచ్చి వృద్ధ జనులందే సేవ చేయించ కె
ట్లో మాన్పింపుము, కాద యేని మృదు పాండు శ్రీ నవచ్ఛాయలో
నీ మై దీధితిలోన జేర్చుకొను తండ్రీ! నన్ను, విశ్వేశ్వరా!

"ఇన్ని మాటలెందుకయ్యా స్వామీ. రెండే మాటలు చెప్తాను విను. అయితే కావలసిన డబ్బు ప్రసాదించి వృద్ధులైన జనుల సేవ చెయ్యకుండా ఎలాగయినా మాన్పించు. లేదా హాయిగా మృదువైన, తెల్లగా మెరిసిపోయే నీ శరీరకాంతిలో నన్ను చేర్చేసుకో" అని అనడంలో ఎంతటి పరితాపం ఉంది!

విశ్వనాథవారి ఆవేదన కేవలం సంసార కష్టాల వల్ల మాత్రమే కలిగినది కాదు. అది మరింత విస్తృతమైనది. భారతీయ భాషా సంస్కృతులకు పట్టిన భ్రష్టత్వాన్ని అతను ఉపేక్షించ లేకపోయారు.

లోపల్లోపల క్రుంగి పోయిన అతని బాధ ఒక నిర్వేదమై పద్యాలలో విషాద గీతంగా ప్రవహించింది.

నా జాతి పూర్వప్రథా జీవ రహితమై
శక్తి నాడుల యందు చచ్చిపోయి
నా మాతృభూమి తేజో మహఃశ్చ్యుతిని బ్ర
హ్మ క్షత్ర తేజంబు మంట గలిసి
నా మాతృభాష నానా దుష్ట భాషల
ఔద్ధత్యమును తల నవధరించి
నా తల్లినేల వేనాటి యాచారముల్
పై మెరుగులు చూచి భ్రమసిపోయి
ఏమి మిగిలినదీ నాటి కిట్టు పొంగు
లొలయు వర్ణానదీ గభీరోదకముల
దైన్య గర్భ చారిత్రముల్ దక్క, భిన్న
గిరి శిఖర దుర్గ పరిదీన గీతి దక్క?

అక్షరాక్షరంలో అతని జాతీయాభిమానం, జాతి గురించిన ఆవేదనా ప్రతిబింబించే పద్యం. అతని మితి లేని జాతీయావేశమే పరభాషలని "దుష్ట భాషలు"అని అనిపించింది. విశ్వనాథలోని ఆవేదన మనం గ్రహించి ఆవేశాన్ని విడిచిపెట్టడం ఉచితం.

భౌతిక మానసిక అవస్థలని అధిగమించి విశ్వనాథ ఆర్తి ఆధ్యాత్మిక పరిధిని చేరుకొని అంతుతెలియని లోతులని సంతరించుకుంది. ఏదో జన్మలో చేసిన తపస్సు పరిపూర్ణం కాక మళ్ళీ జన్మనెత్తిన ఒక భ్రష్ట యోగిలా కనిపిస్తారు విశ్వనాథ.

ఈ యనిలాధ్వమెల్ల నినదించెడు మువ్వలమ్రోత దూరమై పోయిన గోతతిం బిలుచు పోలిక ఏదొ వినిస్వనించెడున్ రాయిడి పొందుచున్ తెలియరాక వగర్చి పురానుభూతముల్ తీయని భావముల్ స్మృతికి తెచ్చుకొనన్ వలవంత కుందెదన్

అన్న శృంగారవీథిలోని యీ పద్యంలో అదే జీవుని వేదన – గాలిలో నినదిస్తూ "మువ్వలమ్రోత దూరమైపోయిన ఆవులమందని పిలుస్తున్నట్లు" ఏదో ఒక వింత సవ్వడి వినిపిస్తుంది. "గో" అంటే జ్ఞాన కిరణం అని కూడా ఒక అర్థం ఉంది. అలా దూరమై పోతున్న జ్ఞాన కిరణాలని తన వేణునాదంతో పిలుస్తున్న ఆ మురళీ కృష్ణుని పిలుపులా ఉందన్నమాట! అది మాటిమాటికీ గుర్తుకు వస్తూ, పూర్వమెప్పుడో అనుభవించిన తీయని అనుభూతులని జ్ఞపకం చేస్తూ, అదేమిటో తెలియక మనసు బాధతో నిండిపోయిందట.

విశ్వనాథ తనలోని ప్రగాఢమైన యీ ఆవేదన అంతటినీ ఒక తపస్సుగా, అంటే అచంచల దీక్షగా మార్చుకున్నారు. అది కవితా తపస్సు. "కవితా రూప తపస్సు చేసెదను శ్రీకంఠా!", అని విశ్వనాథే స్వయంగా కల్పవృక్షంలో చెప్పుకున్నారు. భావన అనే పవిత్ర తీర్థంతో తన యింద్రియ వికారాలని కడిగేసుకోవాలని విశ్వనాథ ప్రయత్నం.

నిరంతరం అతనికి కవితాధ్యానమే. తాను రచించిన ప్రతి వస్తువులోనూ, పదంలోనూ, అక్షరంలోనూ లీనమైపోయి, తనదిగా చేసుకొని కవిత్వాన్ని సృష్టించారు విశ్వనాథ. అలా కాని నాడు యిదిగో యిలాంటి పద్యం రాయగలరా చూడండి!

హనుమంతుడు సీత గూర్చి వెతకి వెతకి చివరకి ఆ తల్లిని కనుగొంటాడు. దాని గురించి హనుమంతుని మాటలు యివి:

కవి మహర్షి తపోగ్నిచే క్రాగి క్రాగి
సర్వ తేజఃఫలంబు రసంబు తుదకు
జూచినట్లుగ జూచితి క్షోణి జాత
జారితార్థ్యంబు జన్మకు సంఘటింప

"కవి అనే మహర్షి కవితా తపస్సనే అగ్నిలో క్రాగి క్రాగి, చివరకి ఆ తపఃఫలితంగా రసాన్ని ఎలా కనుగొంటాడో అలా నేను సీతాదేవిని కనుగొన్నాను, నా జన్మ తరించిపోయిం"దని అంటాడు హనుమంతుడు. అలాటి రససిద్ధికోసమే విశ్వనాథ కూడా తపస్సు చేసారు. ఆ తపస్సంతా రామాయణ కల్పవృక్షంలో ఫలించింది. అందుకే అందులోని ప్రతి పాత్రా సజీవమై విశిష్ట వ్యక్తిత్వంతో వెలుగుతుంది. అతని వేదన ప్రతి పాత్రలోనూ ప్రతిఫలిస్తుంది. ఈ ఆవేదన ఎంత తీవ్రమైనది, విచిత్రమైనది అంటే, మనం ఊహించని పాత్రల్లో కూడా యిది దర్శనమిస్తుంది.

ఉదాహరణకి కైకలోని ఆవేదన యిదే. రాముని అభీష్టం మేరకు, తను అతన్ని అడవికి పంపవలసి వచ్చినప్పుడు, ఆమె అనుభవించిన దుఃఖం వర్ణనాతీతం. ఆ సన్నివేశంలో ఆమె మనస్థితిని విశ్వనాథ చిత్రించిన తీరు అమోఘం.

రావణునిలో కూడా యిదే వేదన సంశయ ఖండంలో మొదలై నిశ్శంశయ ఖండందాకా పెరిగి పెరిగి, చివరికి అతని మృత్యువుతో అది తీరుతుంది.

ఆఖరికి రాముడిలో కూడా యీ వేదన కనిపిస్తుంది. రాముడు మాయామానుష స్వరూపుడంటారు. అంటే తాను అవతార స్వరూపుడన్న జ్ఞానం తనకి లేదు. అందుకే అతను మానవ సహజమైన వేదనకి అతీతుడు కాడు. అదే రామాయణాన్ని రసవత్తర కావ్యంగా మార్చింది. అరణ్యవాసంలో ఏ రాక్షసుణ్ణి సంహరించినా అతను వారి గురించి ఆవేదన చెందుతూనే ఉంటాడు, ఎందుకీ రాక్షసులు మూర్ఖులై యిలా తమ చావుని తాము కొనితెచ్చుకుంటున్నారని.

అమ్మా! దేహమనస్ విచిత్రమగు దుఃఖారామ మంపించు దే
హమ్ముకన్నంతన జీవి పొందనగు బాధా సహ్యతల్ చెప్ప శ
క్యమ్మా? యొక్కొక జీవి యొక్కొక విధంబై పొందు దుఃఖమ్ము, రా
జ్యమ్మో! రాణియొ, కాననంబో, ఋషి భార్యారత్నమో చెప్పగన్

రాముడు కౌసల్యతో అనే మాటలివి. ఇది రామునిలోని జీవుని వేదన. కల్యాణమైన కొన్నాళ్ళకి ఏదో విచిత్రమైన వైరాగ్యం, దుఃఖం రాముని మనస్సుని ఆక్రమిస్తుంది.

"స్వామీ !ప్రాణముకంటె ప్రాణము ధరాజాతా ముఖాంభోజమే
ఏమోగా కనిపించు, లోయెడదలో నింకుస్ సమస్తావనీ
స్వామీత్వాధిక భావనా విషయ వాంఛాపూర్ణ వేశంతముల్
తా మండించెడు గ్రీష్మ మెచ్చటిది !తాతా !నన్ను మన్నింపవే"

అని వెళ్ళి వశిష్ఠునితో మొరపెట్టుకుంటాడు. వశిష్ఠుడు రామునికి యోగ రహస్యాలని బోధించి కొంత ఉపశమనం కలిగిస్తాడు. అయినా రాముని లోని వైరాగ్యం అతన్ని వెంటాడుతూనే ఉంటుంది. చివరికి సీతాదేవి స్వయంగా అతన్ని నిలదీస్తుంది. కన్నీళ్ళు పెట్టుకుంటుంది. ఆ కన్నీళ్ళతో రాముని కన్నీళ్ళు కలిసిపోతాయి. ఈ సన్నివేశమంతా చాలా రసార్ద్రంగా సాగుతుంది.

అని బాష్ప స్నపితాక్షిగల్లయును గాంతాకార దుఃఖంబునై
చను సీతం గని, రామచంద్రుడును బాష్పంబుల్ సుధా రమ్య వా
హినిగా మిశ్రిత శోకమోదవినయహ్రీ రుద్ధ కంఠుండు చా
చిన బాహా జటలస్ గ్రహించికొనియెస్ సీతా వియద్వాహినిస్

సీత కన్నులు కన్నీళ్ళతో నిండిపోయాయి. స్త్రీరూపం దాల్చిన దుఃఖంలా ఉన్న ఆ సీతని చూసి రామునికి కూడా కన్నీళ్ళు ఉబికాయి. అవి సుధా రమ్యంగా ఉన్నాయి, ఎందుకంటే అవి అంత స్వచ్ఛమైనవి కాబట్టి. దుఃఖము, ఆనందము, వినయము, లజ్జ ఇవన్నీ కలగలిసి పొంగుకొచ్చి గొంతు గద్గదమైపోయింది. కన్నీళ్ళలో మునిగిపోయిన సీత ఆకాశగంగలా ఉంది. ఆ గంగని, చాచిన తన చేతులనే జడలతో తనలోకి తీసుకున్నాడట ఆ రాముడు!

రాముడు తన వైరాగ్యం నుండి తేరుకొని, ఆమెతో అంటాడు:

శ్రీవశిష్ఠర్షి సాక్షిగా చెప్పుచుంటి
నస్వతంత్రమ్మయైన దేహమ్ము నందు
నౌనొ కాదొ వచింపగ లేను కాని
యాత్మ నిన్ను నిత్యంబుగా హత్తుకొందు

స్వేచ్ఛ లేని యీ దేహం సంగతి చెప్పలేనుకాని, ఆత్మలో నిన్ను నిత్యమూ హత్తుకొనే ఉంటానన్న రాముని మాటల్లో అద్వైత భావం ఎంతగా దేదీప్యమానమవుతోందో గమనించండి! అంతగా ఒకరికొకరు ఊరడిల్లినా, ఏదో తెలియని ఒకానొక భీతి, భవిష్యత్తులో కలిగే వియోగాన్ని సూచిస్తూ సీతారాముల మనసులని వెన్నాడుతూనే ఉందట.

హత్తిన ప్రీతి యిర్వురకు నాత్మలయం దెడబాటు భీతికిస్
గత్తళమై భజించియు నొకానొక దూర వియోగరేఖలో
నొత్తిన యట్లు తోచిన ముహుర్ముహురావృత గాఢ కాములై
చిత్తములం దొకళ్ళొకరు చేరగనీరు విరామ భావముస్

దూరంగా కనిపించే ఒకానొక వియోగ రేఖకి ఆత్మలో భయమున్నా, మళ్ళీ మళ్ళీ గాఢమైన అనురాగంతో ఒకళ్ళనొకళ్ళు సముదాయించుకుంటూ, మనసుల్లో విరామ భావనాన్ని చేరనివ్వకుండా రోజులు గడిపారట. ఆ తర్వాత అరణ్యవాసంలో ఆ ఎడబాటు కలగనే కలుగుతుంది. ఆ తర్వాత సీత కోసం రాముడు పొందిన ఆవేదనే కథని నడిపిస్తుంది. రాముడు జీవాత్మ అయితే, సీత పరమాత్మ. ఆ పరమాత్మకి దూరమై జీవుడు పొందిన ఆవేదనే రామాయణ కావ్యమయింది.

తనలోని జీవుని వేదనని శాంతింప చేసుకోనే ఆశయంతోనే కవితారూప తపస్సుచేసి, రామాయణాన్ని అద్వైత మత ప్రాతిపదికగా శాంత రస ప్రధానంగా సృజించారు విశ్వనాథ. తద్వారా రససిద్ధి పొందారు.

విశ్వనాథలోని యీ వేదనని పరిపూర్ణంగా అర్థం చేసుకున్నప్పుడే అతని కవిత్వాన్ని లోతుగా అనుభవించగలం, ఆ అనుభూతిలో మనమూ మమైకమవ్వగలం.

దానికి యీ వ్యాసం ఏ కొంతైనా తోడ్పడుతుందని ఆశిస్తాను. ఇది విశ్వనాథ సాహిత్యాన్ని గురించి నిష్పక్షపాతమైన విమర్శా కాదు, సమగ్రమైన పరిచయమూ కాదు. కేవలం నేనెఱిగిన విశ్వనాథ కవిత్వాన్ని గురించి కొద్దిపాటి వివరణ మాత్రమే. ఎప్పుడైనా కవిత్వంలోని గొప్పదనం తెలియాలంటే, దాన్ని స్వయంగా చదివి, అర్థం చేసికొని, అనుభవించవలసిందే!

...దవ్వు పిల్లనగ్రోవి రవము
ప్రాకి పసిత్రాచు పిల్లలు దూకినట్లు,
జల్లుపడినప్డు పరుపైన రాళ్ళ మీద
వెండి నీళ్ళులు జలజల వెడలినట్లు,
నీల మధుమూర్తి గుండెలో నిండినపుడు
యోగి చెక్కిళ్ళ కన్నీళ్ళు సాగినట్లు,
నవ్వుచును పసివాడు స్తన్యంబు గ్రోలు
చమ్మ మొగమును చూచుచో నార విడుచు
సెలవులందున క్షీరమ్ము చిందినట్లు,
ఉపనిషద్దేవి ప్రక్కల కొరిగి నవ్వి
నట్లు, వేదముల్ గలగల లాడినట్లు...

మురళీ గానాన్ని వర్ణిస్తూ విశ్వనాథవారు రాసిన పద్యం యిది. చిన్న త్రాచు పిల్లలు దూకినట్లుగా, వానజల్లు పడినపుడు నున్నని రాళ్ళపై ఆ చినుకుల ధార జలజలా పారినట్లుగా, తాను ఆరాధిస్తున్న స్వామి తన గుండెలో నిండినపుడు ఉబికిన కన్నీళ్ళు యోగి చెంపలపై సాగినట్లుగా, నవ్వుతూ చనుబాలు తాగే పసివాడు మధ్యలో అమ్మని చూసినప్పుడు పాల బొట్లు చిందినట్లుగా, ఉపనిషత్ దేవి కాస్త పక్కకి ఒరిగి చిరునవ్వు నవ్వినట్లుగా, వేదాలు గలగలమన్నట్టుగా... అలా ఉందట ఆ వేణు రవం.

కృష్ణశాస్త్రి వేణునాదం తీయనిదైతే విశ్వనాథది కడు విచిత్రమైనది. అతని కవిత్వమూ అంతే!